# టిస్యూ చీర

రచన:
యన్ దేవకీదేవి

అప్పుడప్పుడే సాయంత్రం అవుతోంది. సంధ్య చీకట్లు నలుదిశలా వ్యాపిస్తోన్నాయి. రావు ఆఫీసునుండి ఇంటిముఖం పట్టాడు. ఇంటికి వచ్చి దుస్తులుమార్చి వీధి వరాండాలో ఈజీచైర్ మీద పడుకొని పేపరు చదువుతున్నాడు. ఇంతలో సుజాత కాఫీ రెడీచేసి కప్పుతో ప్రత్యక్షమైంది.

"ఏమండీ! పండుగలన్నీ దగ్గరకొస్తున్నాయి. కొత్తచీర వొక్కటీ యింట్లో శాంపిలుకైనా లేదు, రేపు బజారువెళ్లి పట్రాండి!" "అప్పుడే అంత తొందరెందుకు? ఓస్! ఆరోజుకు తేలేక పోతానా! అయినా ప్రస్తుతం చేతులో పైసా కూడాలేదు నెలాఖరు. అప్పోసప్పోచెయ్యాలి."

"అబ్బ! ఎప్పుడడిగినా డబ్బులేదన్న శబ్దమే కదా! ఏదో పండుగవస్తుందికదా అని ముచ్చట పడడిగితే అంత ముదిపమెందుకూ? పోనీ యిష్టం లేదంటే తీరిపోతుందిగా?"

"అయ్యో! నీకుమట్టుకే చీరలుతెస్తే, నాకు పంచలూ షర్టులూ అక్కరలేదనుకున్నావా?" సుజాత ముఖం ముడుచుకొని, యింట్లోకి వెళ్ళిపోయింది రుసరుసలాడుతూ.

మరుసటిదినం ఆదివారం అవడంచేత సావధానంగా యింట్లో తన గదిలో పడుకొని యేదో డిటెక్టివ్ నవల తీవ్రంగా చదువుతున్నాడు. ఇంతలో తన ప్రియమిత్రుడైన ప్రసాద్ రావడంవల్ల తన చదువు కంతరాయం కలిగింది. రావు మిత్రుణ్ణి లోపలి కాహ్వానించి, యెప్పుడూ ప్రశాంతంగా వుండే తన లైబ్రరీ రూముకి వెళ్ళి చెరో కుర్చీలో కూర్చున్నారు

"ఒరేయ్ రావూ! నిన్న మనం చూసింది నీకు నచ్చిందా?"

"నచ్చిందిగాని రేటు కొంచెం యెక్కువగా వుందోయ్"

"రేటు యెవడికొవాలోయ్ డబ్బుపోయినా అనుభవ ముండొద్దోయ్. కొంచెం!"

"నిన్న నాచేతిలో సమయానికి డబ్బులేక పోయిందికదా! ఏమైనాకూడా చాలా బాగుందిరా! ఏం! యేమంటావు? దాన్ని చూసేసరికి కళ్ళు జిగేలుమన్నాయి

అప్పుడే రెండుకప్పుల కాఫీ ట్రేలో పెట్టుకు వచ్చి తలుపుచాటునుండి, వారి సంభాషణంతా చెవులు నిక్కించివింది సుజాత. ఒకొక్క మాట శూలంలాగ ఆమె హృదయాన్ని నాటి, కలతపరిచింది. మళ్ళీ మాటలు వినబడ్డాయి ఆమె హృదయం వాళ్ళను నూరెఖానీ చేద్దామా యనుకుంది

"ఒరే ప్రసాద్! మళ్ళీ యివాళవెళ్ళి ప్రయత్నిద్దామా?"

"అలాగైతే యిప్పుడే బయల్దేరుదాం ఎన్ని తంటాలైనా పడి, చేజిక్కించుకొంటాం గాని వూరికే వొదిలిపెట్టంగా.

"ఊఁ! పదమరి ఆలస్యందేనికి" అని రిష్టువాచీలో టైము చూచి, "అప్పుడే ఐదున్నరయింది. జర్దీ వెల్దాం"

"ఆలస్యంగా వెళ్లినా పర్వాలేదు మనకంటబడి యెక్కడకు వెళ్తుంది .. . ప్రొద్దుపోతేనే మంచిది సావధానంగా బేరమాడొచ్చు"

"దాని సోయగంచూచి బేరమాడ బుద్ధివెయ్యదురా. పద ఇప్పుడు బయల్దేరితేమాత్రం యేం మునిగిందోయ్ మెల్లిగా బీచివేపువెళ్ళి, అక్కడనుండి టైముకి వెళ్దాం"

"సుజాతా! బోనే ఎక్కడా! తలుపు వేసుకో వెళ్తున్నాం."

రావు, ప్రసాద్ లిద్దరూ వెళ్ళిపోయారు సుజాత ట్రే ఒకమూల పారవేసి తలుపు వెయ్యకుండానే వెళ్లి మంచంమీద బోర్లపడుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ తనలో "ఛ ఛ!! ఏమిలోకం! పాడు ప్రపంచం ఎంతకృతఘ్నం.

మొగపుట్టుక పుట్టారన్న మాటేగానీ, శుద్ధ మూఢులు. గోముఖవ్యాఘ్రాలు పయోముఖ విష కుంభాలు. ఈయనన్నెంత మోసంచేశారు. నా గొంతు కోశారు. ఇలాటివారని యెప్పుడూ అనుకోలేదు నేనొకదాన్ని వుండగానే, పరస్త్రీతో బేరము. నాఖర్మం యిలాగేడుస్తుంటే ఆయన్నంటే ఏంలాభం. స్త్రీ అంటే వంటింటి కుందేలులాగ పొయ్యిదగ్గర పడివుండమని గాబోలు పురుషుల శాసనం. అగ్నిసాక్షిగా ఒకఅబలను పెండ్లిచేసుకొని, ఆమెను సర్వనాశనంచెయ్యడం వీరిఆశయంకాబోలు- ఇది న్యాయమేనా? స్వతహాగా వారికా బుద్ధి లేకపోయినా స్నేహితుల వల్లనైనా సప్తవ్యసనాలకు లోబడి చెడిపోతారు- ఇంక నాకీజన్మ దేనికి? ఏబావిలోపడ్డా నాలుగు గుక్కిళ్ళు నీళ్ళుమింగి చావొచ్చు"

గడియారమప్పుడే పదిగంటలు కొట్టింది- సుజాత పరితాపం మరీ యెక్కువైంది- ఆమె హృదయం వెయ్యిరంపాలతో కోసినట్లయి, అసూయతో కుంగిపోతుంది- ఆరోజుఅన్నంకూడావండలేదు- ఆమె జీవితంలో ఆదినం అంధకారబంధురంగా తోచింది- ఆవేళ పండువెన్నెల కాస్తున్నప్పటికీగూడ, సుజాత హృదయంలో తుఫానురేగి, అమావాస్యమయం చేస్తుంది- ఇంతలో దగ్గరగా వేసివున్న వీధితలుపు యెవరో తోస్తున్న శబ్దమయింది- క్రమంగా బూటుకాళ్ళ చప్పుడు సమీపించింది- ఆ వస్తున్న వ్యక్తి తన భర్తయని ఊహించి, మరీ కోపంతో, దుఃఖంతో ముసుగు తన్ని పడుకుంది సుజాత-

"సుజాతా! సుజాతా! యెక్కడున్నావ్"

యిల్లంతా చీకటిగా వుండడంవల్ల, అగ్గిపుల్లగీచి భార్యకు ప్రియంతో తెచ్చిన వస్తువును టేబిల్ మీద పెట్టి, బెడ్‌లైటు వెలిగించి గదంతా వెదికి, ముసుగుపెట్టుకొనివున్న భార్యని చూశాడు-

"ఏ సుజాతా! పిలిస్తే పలకవేం?"

(గద్గదకంఠంతో) "ఇప్పుడు నే కావలసి వచ్చానుకామోసు- నాతో మాట్లాడొద్దు- దాని దగ్గరకే వెళ్ళండి-"

(నిర్ఘాంతపోయి) "ఏమిటీ నీమాటలూ... .. నా కర్థంకావటం లేదు-"

"అవును పాపం! ఎలాగర్థమవుతాయీ...... అక్కర తీరితే అక్క మొగుడు కుక్కట- పోండి ఎక్కడనుండి వచ్చారో అక్కడికే వెళ్ళండి-"

(మరీ యాశ్చర్యంగా) "నీ ధోరణి నాకేమీ తెలీడంలేదు- ముఖం యెందుకలా కంది యెఱ్ఱబారిందీ? ఏడుస్తున్నావా? ఆ! చెప్పు! చెప్పు సుజాతా!" అని గడ్డంపట్టుకు బ్రతిమలాడాడు-

"మీరుచేసే పనులకు నాకు ఏడుపుకాక మరేమిటీ?"

"నీకుపిచ్చియేమన్నా యెక్కిందా? యేమిటీ ఎందుకా యేడుపూ...నీకోసం కొట్లన్నీగాలించి, యీకోక తెచ్చానుచూడు- ఎంతబాగుందో" అని టేబిల్ మీద పెట్టిన, టిస్యూసారీని మంచంపైన గిరాటవేశాడు- అది కట్లువీడి జలజలమని చెదరి ఆగుడ్డివెలుగులోకూడా కళ్ళకు మిరిమిట్లు కొలుపుతూంది-

'నాకేంవద్దులేండాచీరె- ఎలాగైతే తెచ్చారు, గొప్పగా, టిస్యూసారీయట- టిస్యూసారీ- ప్రేమతో వలచిన ప్రియురాలికే యివ్వరాదూ...?"

"ఏప్రియురాలు? ఎవరది? నీవుతప్ప నాకెవరూ లేరే? నీకేమన్నా పిచ్చెక్కిందా?"

"ఆహా!! మీకేమీ తెలీదుగామోసు- నంగనాచి తుంగబుఱ్ఱ లాగు- ఆ నక్కనయిత్యాలు, టక్కులూ దేనికి?"

"అసలుసంగతిచెప్పకుండా నాకీసోదేమిటే"

"అవును మరీ- నేను సోదినే- నామాటలూ సోదే. ఎలావచ్చుతాయి- సాయంత్రం మీఫ్రెండుతో మీరుమాట్లాడేమాటలన్నీవింటూ నేవున్నా'

"నేనేమన్నాను .. (కొంచెం ఆలోచించి) యీటిస్యూసారీ సంగతేగా మాట్లాడుకున్నాము, మొన్న నేను చేతిలో డబ్బులేకుండా వెళ్ళాను- నువ్వుపండక్కి అడిగావు కదా అని యింతా శ్రమపడితెస్తే యిదేనా నాకు కిరీటం- చాలా బాగుంది నీతంతు"

రావుప్రసాద్‌లు మాట్లాడిన సంభాషణం యీ చీరెకే సంబంధించి వుండడంవల్ల సుజాత తన పొరపాటుకి సిగ్గుపడ్డది- రావు తన భార్య తెలివి తక్కువకు నవ్వాడు-